క్లుప్తంగా

కనీస వేతనాలు చెల్లించాలంటూ ధర్నా



లంపకలోవ వీరభద్ర రొయ్యల మేత పరిశ్రమ వద్ద ధర్నా చేస్తున్న కార్మికులు

ప్రత్తిపాడు: మండలంలోని లంపకలోవ వీరభద్రా ఎక్స్‌పోర్ట్ ప్రైవేటు లిమిటెడ్ కంపెనీలో పని చేస్తున్న తమకు కనీస వేతనాలు చెల్లించాలని కోరుతూ గురువారం కార్మికులు ఆందోళన చేపట్టారు. సీఐటీయూ ఆధ్వర్యంలో కంపెనీ ప్రధాన గేటు వద్ద గురువారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకుడు రొంగల ఈశ్వరరావు మాట్లాడుతూ కంపెనీ (రొయ్యల మేత పరిశ్రమ)లో అనేక సంవత్సరాలుగా పనిచేస్తున్న కార్మికులకు కనీస వేతనాలు చెల్లించడం లేదన్నారు. కార్మికులకు కనీస వేతనంతో పాటు పీఎఫ్, ఈఎస్ఐ ఎప్పటికప్పుడు చెల్లించాలని, పరిశ్రమంలో పనిచేస్తున్న కార్మికులకు సేఫ్టీ సౌకరాలు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కార్మికులు శెట్టి రామారావు, జి.సందీప్, ఆర్.మణికంఠ, జి.దుర్గా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఉపవాస ప్రార్థనలు

జగ్గంపేట: స్థానిక బేతేలు చర్చిలో గత రెండు రోజులుగా ఉపవాస ప్రార్థనలు నిర్వహిస్తున్నట్లు పాస్టర్ సుదర్శనరావు గురువారం తెలిపారు. చర్చిలో ఏటా మూడు రోజుల పాటు ఉపవాస ప్రార్థనలు నిర్వహిస్తామన్నారు. దీనిలో భాగంగా గత రెండు రోజులుగా ప్రార్థనలు జరుగుతున్నాయన్నారు. ప్రార్థనల్లో మండలానికి చెందిన పలువురు పాస్టర్లు, విశ్వాసులు పాల్గొన్నారు.

ధర్మవరంలో పారిశుధ్య పనులు



ధర్మవరంలో ట్రాన్స్‌ఫార్మర్ వద్ద పారిశుధ్య పనులు పర్యవేక్షిస్తున్న నాయకులు

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని ధర్మవరంలో గురువారం ప్రత్యేక పారిశుధ్య డ్రైవ్ నిర్వహించారు. స్థానిక 12వ వార్డులో జీఎల్ఆర్ ట్యాంకు వద్ద డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో భారీగా మురుగు నీరు నిలిచిపోయింది. అక్కడ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఉండటంతో ప్రజలు నీరు పట్టుకునేందుకు భయాందోళనకు గురయ్యేవారు. ఈ సమస్యను బీజేపీ మండల ఉపాధ్యక్షుడు ఊటా వీరబాబు దృష్టికి స్థానికులు తీసుకువెళ్లారు. ఆయన ఫిర్యాదు మేరకు గ్రామ సర్పంచ్ బెంతుకుర్తి సుశీల అబ్బాయి పర్యవేక్షణలో పారిశుధ్య పనులు చేపట్టారు. 12వ వార్డులో వ్యర్థాలు తొలగించి బ్లీచింగ్ చల్లారు. ప్రజలకు పరిశుభ్రతపై అవగాహన కల్పించారు.

మద్యం మత్తు.. కుటుంబాలు చిత్తు



రాపాకలో మద్యం సీసాల మూటలను పడేసిన చెరువు



కేఓ.మల్లవరంలో మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్న రూరల్ ఎస్సై, సిబ్బంది

- విచ్చలవిడిగా గ్రామాల్లో మద్యం విక్రయాలు
- అధికార పార్టీ కార్యకర్తలే సూత్రధారులు
- ఉపేక్షించబోమంటున్న రూరల్ పోలీసులు

తుని రూరల్: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గ్రామాల్లో మద్యం భూతం మళ్లీ జడలు విప్పింది. పల్లెల్లో విచ్చలవిడిగా వెలిసిన బెల్టు షాపుల్లో 24 గంటలూ మద్యం విక్రయాలు సాగుతున్నాయి. ధనార్జనే లక్ష్యంగా కొంతమంది గ్రామ స్థాయి నాయకులు, కార్యకర్తలు అక్రమ మద్యం, బెల్టు షాపులకు తెరతీశారు. తుని నియోజకవర్గంలో ఈ పరిస్థితి మరింత ఎక్కువగా కనిపిస్తోంది. నియోజకవర్గ నాయకుడి దగ్గర పలుకుబడి ఉందంటూ అక్రమార్కులు వద్ద కొంతమంది రింగు మాస్టర్లు చక్రం తిప్పేందుకు చేసే ప్రయత్నాలు పోలీసుల రూపంలో బెడిసికొడుతున్నాయి.



రాపాకలో బెల్టు షాపు

మద్యంతో పట్టుబడుతున్న టీడీపీ శ్రేణులు

తుని రూరల్ పోలీసులు చేస్తున్న దాడుల్లో గత నాలుగు రోజులుగా తెలంగాణ, ఒడిశా, గోవా, తదితర రాష్ట్రాలకు చెందిన మద్యం సీసాలతో టీడీపీ కార్యకర్తలు పట్టుబడుతున్నారు. తుని మండలం ఎస్.అన్నవరం శివారు, కేఓ మల్లవరం గ్రామాల్లో రూరల్ సీఐ చెన్నకేశవరావు, ఎస్సై కష్ణామాచారి ఆధ్వర్యంలో పోలీసులు దాడులు చేసి రూ.లక్షలు విలువ చేసే 6,310 క్వార్టర్ల మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని నలుగురు వ్యక్తులపై కేసులు నమోదు చేశారు. ఈ సంఘటనలతో బెంబేలెత్తిన తెలుగు తమ్ముళ్లు బుధవారం రాత్రి తుని మండలం రాపాక శివారు అనకాపల్లి జిల్లా కోటవురట్లకు వెళ్లే మార్గంలోని చెరువులో మద్యం సీసాలను మూటలు కట్టి పడవేశారు. చెరువులో కొన్ని మద్యం సీసాలు తేలడాన్ని గురువారం అటుగా వెళుతున్న స్థానికులు చూశారు. దీంతో మందుబాబులు ఎగబడి చెరువులోకి దిగి మద్యం మూటలను తరలించుకుపోయారు. రాపాక శివారులో ఉన్న బెల్టు షాపు యథాతథంగా కొనసాగుతోంది.

నాడు గుట్కా–నేడు అక్రమ మద్యం

కేఓ మల్లవరంలో 2014–19 మధ్య భారీగా గుట్కా వ్యాపారం నిర్వహించిన అనుభవంతో కొందరు ఇప్పుడు అక్రమ మద్యాన్ని ఏరులై పారిస్తున్నట్టు తెలుస్తుంది. వీరికి మండలస్థాయి నాయకుల అండ ఉండడంతో అక్రమ మద్యాన్ని బెల్టు షాపులు ద్వారా విక్రయిస్తున్నట్టు తెలుస్తుంది. ఈ క్రమంలోనే కేఓ మల్లవరానికి చెందిన వ్యక్తులు అక్రమ మద్యం నిల్వలతో చిక్కినట్టు పలువురు పేర్కొన్నారు. వెలుతురు ఉండగానే ఇల్లు చక్కబెట్టుకోవాలన్న సామెత మేరకు అధికారం ఉండగానే రూ.లక్షలు ఆర్జించాలన్న ఆత్రుతలో టీడీపీలో కొంతమంది కిందస్థాయి నాయకులు, కార్యకర్తలు అక్రమ మద్యం, బెల్టు షాపుల నిర్వహణను కొనసాగిస్తున్నారు. ఈ విషయంలో నియోజకవర్గ స్థాయి నాయకుల మాటలను పెడచెవిన పెట్టి అధికారులను మేనేజ్ చేస్తూ వ్యాపారాన్ని కొనసాగిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఆకస్మిక దాడులతో అక్రమ మద్యాన్ని పట్టుకుంటున్న పోలీసులు ప్రధాన సూత్రదారిని పట్టుకునేందుకు జల్లెడపడుతున్నారు.

మాఫియాను అరికడతాం

నియోజకవర్గంలో చీకటి వ్యాపారాలు, అక్రమ మద్యం నియంత్రణకు పటిష్టమైన నిఘా ఏర్పాటు చేశాం. అక్రమాలకు పాల్పడితే ఎంతటివారినైన చట్ట ప్రకారం కఠినంగా శిక్షిస్తాం. అక్రమ మద్యం నియంత్రణపై ఇప్పటికే ఆకస్మిక దాడులు, తనిఖీలు చేస్తున్నాం. మాఫియాను అణిచివేసేందుకు వెనుకాడేదేలేదు.

– చెన్నకేశవరావు, సర్కిల్ ఇన్‌స్పెక్టర్, తుని రూరల్

రెస్టారెంట్లు, హోటళ్లలో పోలీసుల తనిఖీలు



దాబా యజమానికి సూచనలిస్తున్న జగ్గంపేట సీఐ వైఆర్‌కే శ్రీనివాసరావు

జగ్గంపేట/గండేపల్లి: పదహారో నంబర్ జాతీయ రహదారిపై జగ్గంపేట పోలీసు సర్కిల్ పరిధిలో ఉన్న దాబాలు, హోటళ్లలో పోలీసులు తనిఖీలు నిర్వహించారు. జగ్గంపేట సీఐ వైఆర్‌కే శ్రీనివాసరావు ఆధ్వర్యంలో రామవరం నుంచి మురారి వరకూ వున్న దాబాలు, ఫ్యామిలీ రెస్టారెంట్లు, హోటళ్లలో తనిఖీలు చేశారు. ఆహారం నాణ్యతపై హోటళ్లు, దాబాల యజమానులకు అవగాహన కల్పించారు. దొంగతనాలు, గంజాయి వంటి మత్తు పదార్థాల రవాణా నేపథ్యంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. హోటళ్ల వద్ద మద్యం తాగరారాదన్నారు. సీసీ కెమెరాలు, తప్పకుండా ఏర్పాటు చేయాలని సూచించారు. హోటల్స్ వద్ద పార్కింగ్ ప్రదేశాల్లో మాత్రమే వాహనాలు నిలిపేలా చూడాలని, జాతీయరహదారిపై వాహనాలు నిలపకుండా యాజమాన్యం భాధ్యత వహించాలని తెలిపారు. కార్యక్రమంలో గండేపల్లి ఎస్సై శివనాగబాబు, పోలిసు సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనులపై సామాజిక తనిఖీ

కిర్లంపూడి: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం ఉపాధి హామీ సామాజిక తనిఖీ సమన్వయ సమావేశం నిర్వహించారు. ఎంపీడీఓ హరికృష్ణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎంపీపీ తోట రవి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్ఆర్‌పీ సింహాద్రి మాట్లాడుతూ 2023–2024లో ఉపాధి హామీ పథకం ద్వారా మండలంలో జరిగిన 818 పనులకు గాను ఉపాధి కూలీలకు రూ.7.34 కోట్లు, పనిముట్లకు రూ.2.49 కోట్లు ఖర్చు చేశామన్నారు. పనులపై అభ్యంతరాలు ఉంటే మీ గ్రామాల్లో నిర్వహించే గ్రామ సభల్లో తెలియపరచాలని సూచించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు తోట గాంధీ, ఎంపీటీసీల మండల సమాఖ్య ప్రెసిడెంట్ అల్లు శివరామకృష్ణ, ఇన్‌చార్జి ఏపీఓ ఏవీబీ నాయుడు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ తోట రవి

రతన్ టాటా మృతికి సంతాపం

ప్రత్తిపాడు: వ్యాపార ప్రపంచంలో చెరగని ముద్ర వేసిన ప్రముఖ పారిశ్రామిక వేత్త రతన్ టాటా మృతి దేశానికి తీరని లోటు అని పీసీసీ సభ్యుడు ధరణాల కోట శ్రీను అన్నారు. ప్రత్తిపాడు కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో గురువారం రతన్‌టాటా మృతికి సంతాపం వ్యక్తం చేశారు. ఆయన చిత్ర పటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. దేశానికి ఆయన చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కందిమళ్ల సామ్యేలు, మాదే మోషే, కోటిపల్లి సూరిబాబు, బంగారు నాగేశ్వరరావు, కోన సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పుస్తకాల పంపిణీ



విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేస్తున్న దృశ్యం

జగ్గంపేట: స్థానిక జ్యోతుల నెహ్రూకాలనీలో వేంచేసిన లక్ష్మీ గణపతి ఆలయం వద్ద గురువారం 500 మంది విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేశారు. దసరా ఉత్సవాల్లో భాగంగా పురాణపండ సత్యనారాయణ చారిటబుల్ ట్రస్టు సహకారంతో సమకూర్చిన విద్యాసామగ్రిని స్థానిక నేతలు విద్యార్థులకు అందజేశారు. కార్యక్రమంలో పెద్దకాపు, సాయిరాం మాస్టర్, రిటైర్డు టీచర్ మారిశెట్టి భద్రరావు, లోడగల త్రిమూర్తులు, ట్రస్టు చైర్మన్ శేష సాయి శర్మ పాల్గొన్నారు.

మానసిక ఆరోగ్యంపై అవగాహన



సదస్సులో మాట్లాడుతున్న అడ్వకేట్ మల్లేశ్వరరావు

శంఖవరం: మానసిక రోగుల పట్ల కుటుంబ సభ్యులు బాధ్యత వహించాలని ప్రత్తిపాడు మండల ప్యానల్ అడ్వకేట్ ఆకాశపు మల్లేశ్వరరావు అన్నారు. వరల్డ్ మెంటల్ హెల్త్ దినోత్సవం సందర్భంగా గురువారం స్థానిక పీహెచ్‌సీలో డాక్టర్ ఆర్‌వీవీ సత్యనారాయణ అధ్యక్షతన న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానసిక రోగుల పట్ల కుటుంబ సభ్యులు, వైద్యులు బాధ్యతగా వ్యవహరించాలన్నారు. మానసిక ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అడ్వకేట్ రాజాల చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

మద్యం దుకాణాలకు 167 దరఖాస్తులు

తుని: ప్రభుత్వం తీసకువచ్చిన మద్యం దుకాణాలకు 167 దరఖాస్తులు వచ్చాయని తుని ఎక్సైజ్ సీఐ పట్టాభి చౌదరి గురువారం తెలిపారు. తుని సర్కిల్ పరిధిలో తుని మున్సిపాలటీ, తుని, తొండంగి, కోటనందూరు, రౌతులపూడి మండలాలు ఉన్నాయన్నారు. మొత్తం 22 దుకాణాలకు టెండర్లు పిలిచారన్నారు. ఆయా షాపులకు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో దరఖాస్తులు వచ్చాయన్నారు. ఈ నెల 9తో గడువు ముగియాల్సి ఉన్నా ప్రభుత్వం రెండు రోజుల పాటు పొడిగించిందన్నారు. శుక్రవారం సాయంత్రం వరకు దరఖాస్తులను స్వీకరిస్తామన్నారు. రాజకీయ ఒత్తిళ్లు ఏమి లేవని, అందుకే ప్రభుత్వం మూడు విధానాలను తీసుకువచ్చిందని తెలిపారు.

వైభవంగా బోనాల సంబరం



ఏలేశ్వరం బోనాల ఊరేగింపులో మహిళలు

గోకవరం: మండలంలోని వెదురుపాకలో బాపనమ్మతల్లి బోనాల సంబరం గురువారం వైభవంగా జరిగింది. గ్రామంలోని భవానీ భక్తులు, మహిళలు సుమారు 300 మంది బోనాలను తలపై పెట్టుకుని ఊరేగింపు నిర్వహించారు. బోనాలతో గ్రామ శివారున ఉన్న బాపనమ్మ తల్లి ఆలయానికి వెళ్లి అమ్మవారికి సమర్పించారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. విశేష సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

అమ్మవారికి చీర, సారె సమర్పణ

ఏలేశ్వరం: దేవి నవరాత్రుల్లో భాగంగా తోటవీధిలో వేంచేసిన దుర్గమ్మకు గురువారం భక్తులు చీర, సారె సమర్పించారు.

స్థానిక తోటవీధి నుంచి వందలాదిగా మహిళలు సారెతో స్థానిక మరిడమ్మ తల్లి, పైడిమల్లమ్మతల్లి, సంతోషిమాత, రూపులమ్మ అమ్మవారి ఆలయాల మీదుగా ఊరేగింపు నిర్వహించారు. అలాగే స్థానిక సంతోషిమాత ఆలయం వద్ద దుర్గాదేవి గుడి నుంచి పట్టణంలోని పలు ప్రాంతాల మీదుగా బోనాల ఊరేగింపు జరిగింది. మహిళలు, పిల్లలు వందలాదిగా పాల్గొన్నారు.



సారెతో ఊరేగింపులో పాల్గొన్న మహిళలు

భక్తిశ్రద్ధలతో చండీ హోమం

గోకవరం: స్థానిక ఊరకాలువ గట్టుపై వేంచేసిన కనకదుర్గాదేవి ఆలయంలో గురువారం చండీహోమం నిర్వహించారు. గాజింగం సత్తిబాబు, వల్లీదేవి దంపతులు పీఠలపై కూర్చొని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

దుర్గాదేవీ నమోస్తుతే...



రౌతులపూడిలో కనకదుర్గ అమ్మవారిని దర్శించుకుంటున్న వరుపుల సుబ్బారావు, పార్టీ నేతలు



గోకవరంలో దుర్గాదేవి అలంకారంలో దర్శనమిస్తున్న దేవీచౌక్ కనకదుర్గమ్మ



కాకరాపల్లిలో దుర్గాదేవిగా దర్శనమిస్తున్న కనకదుర్గమ్మ



ఏలేశ్వరంలో దుర్గాదేవిగా అమ్మవారు



సీతంపేటలో దుర్గా మీనాక్షి అమ్మవారు

- విశేష అలంకరణలో దర్శనమిచ్చిన జగన్మాత
- ఆలయాల్లో ప్రత్యేక పూజలు

ఏలేశ్వరం/తుని రూరల్/కోటనందూరు/ కిర్లంపూడి/శంఖవరం/గోకవరం/ప్రత్తిపాడు రూరల్/ తొండంగి/రౌతులపూడి/అన్నవరం: దేవీ శరన్నవరాత్ర ఉత్సవాలు తుని, ప్రత్తిపాడు, జగ్గంపేట నియోజకవర్గాల్లో వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఎనిమిదో రోజు గురువారం లోవ దేవస్థానంలో కొలువైన తలుపులమ్మ అమ్మవారు దుర్గాదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. పండితులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. కోటనందూరు మండలం కాకరాపల్లిలో వేంచేసిన కనకదుర్గమ్మ గురువారం దుర్గాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. వేద పండితులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భారీగా భక్తులు దుర్గాదేవిని దర్శించి తరించారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో హోమాలు, భజనలు చేశారు. సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి.

కిర్లంపూడి మండలంలో...

కిర్లంపూడి మండలం జగపతినగరంలో వేంచేసిన అభయ దుర్గ, కిర్లంపూడిలోని వాసవీ కన్యకా పరమేశ్వరి, రామచంద్రపురం, వీరవరం గ్రామాల్లోని అమ్మవార్లు గురువారం దుర్గాదేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. పండితులు అమ్మవార్లకు పండ్ల రసాలతో అభిషేకాలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

ఏలేశ్వరంలో...

ఏలేశ్వరం తోటవీధిలో వేంచేసిన అమ్మవారు గురువారం దుర్గాదేవిగా భక్తలకు దర్శనమిచ్చారు. ఆర్టీసీ కాంప్లెక్స్, నర్సీపట్నం రోడ్డు, మార్కెట్‌వీధి తదితర ప్రాంతాల్లో అమ్మవారికి మహిళలు ప్రత్యేక పూజలు చేశారు. విజయ దశమి రెండు రోజులు ఉండడంతో ఆలయాల వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. శంఖవరం మండలం సీతంపేటలో వేంచేసిన దుర్గా మీనాక్షి అమ్మవారు దుర్గాదేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు.

రత్నగిరిపై వనదుర్గ, కనకదుర్గ అమ్మవార్లకు

రత్నగిరిపై నిర్వహిస్తున్న దసరా వేడుకల్లో భాగంగా ఎనిమిదో రోజు గురువారం రత్నగిరి దుర్గామాతలు వనదుర్గ, కనకదుర్గ అమ్మవార్లను దుర్గామాతగా అలంకరించి పూజించారు. పులిని అధిరోహించి ఒక చేతిలో శూలం, మరో చేతిలో శంఖం, ఇంకో చేతిలో పాశం, మరో చేతిలో ఖడ్గం, ఒక చేతిలో గులాబీ, ఒక చేతిని అభయహస్తంగా చూపుతూ దర్శనమిచ్చిన వనదుర్గ, కనకదుర్గ అమ్మవార్లను పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించి పూజలు చేశారు. ఉదయం తొమ్మిది గంటల నుంచి 11 గంటల వరకూ దర్బారు మండపంలో రుత్విక్కులు చండీ సప్తశతీ పారాయణలు, రామాయణ, మహాభారత పారాయణ, మహాలింగార్చన, సూర్యనమస్కారాలు నిర్వహించారు. సాయంత్రం నాలుగు గంటల నుంచి ఆరు గంటల వరకు దుర్గాలయాల్లో అమ్మవార్లకు రుత్విక్కులు లక్ష కుంకుమార్చనలు నిర్వహించారు. రాత్రి ఏడు గంటల నుంచి సత్యదేవుని ఆలయంలో స్వామి అమ్మవార్లకు నీరాజనమంత్రపుష్పాలు సమర్పించి ప్రసాదాలు నివేదించారు. ఆలయ ప్రధానార్చకులు ఇంద్రగంటి నర్సింహమూర్తి, కోట సుబ్రహ్మణ్యం, కల్యాణబ్రహ్మ చామర్తి కన్నబాబు, వనదుర్గ, కనకదుర్గ ఆలయ అర్చకులు కోట వంశీ, కంచిబట్ల సాయిరామ్ ఆధ్వర్యంలో అమ్మవార్లకు రుత్విక్కులు ప్రత్యేక పూజలు చేశారు.

మండపారాధన, చండీహోమం ప్రారంభం

దుర్గాష్టమి సందర్భంగా పండితులు మండపారాధన చేశారు. తరువాత చండీ హోమానికి పండితులు అంకురార్పణ చేశారు. మహార్నవమి సందర్భంగా శుక్రవారం కూడా అమ్మవారికి చండీహోమం నిర్వహించనున్నట్టు తెలిపారు.

కనకదుర్గ ఆలయంలో వరుపుల పూజలు

రౌతులపూడి సినిమా సెంటర్‌లో వేంచేసిన కనకదుర్గ అమ్మవారి ఆలయంలో వైఎస్సార్ సీపీ ప్రత్తిపాడు నియోజకవర్గ ఇన్‌చార్జ్ వరుపుల సుబ్బారావు గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. దసరా ఉత్సవాల్లో భాగంగా వైఎస్సార్ సీపీ శ్రేణులతో కలసి ఆయన అమ్మవారిని దర్శించుకున్నారు. ఆయన వెంట పార్టీ నేతలు వరుపుల సూరిబాబు, వాసిరెడ్డి జమీలు, జెడ్పీటీసీ సభ్యుడు గొల్లు చినదివాణం, రౌతులపూడి ఉపసర్పంచ్ వాసిరెడ్డి భాస్కరబాబు, సొసైటీ మాజీ అధ్యక్షుడు సోమరౌతు భాస్కరబాబు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పోలుపర్తి తాతాజీ, మండల పరిషత్ కో ఆప్షన్ సభ్యుడు సీహెచ్‌వీవీ సత్యనారాయణ తదితరులు ఉన్నారు. కాగా రౌతులపూడిలో కనకదుర్గ అమ్మవారిని గురువారం ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ దర్శించుకున్నారు. ఎంపీపీ గంటిమళ్ల రాజ్యలక్ష్మి, పలువురు నేతలు పాల్గొన్నారు.



రత్నగిరిపై చండీహోమం చేస్తున్న పండితులు

రాచపల్లిలో..

ప్రత్తిపాడు మండలం రాచపల్లి అరుణాచలేశ్వర స్వామి దేవస్థానంలో కొలువైన అపిత కుచాంబ అమ్మవారు దుర్గాదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. పరిసర గ్రామాల భక్తులు భారీగా తరలివచ్చి అమ్మ వారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఒమ్మంగి, ధర్మవరం, గజ్జనపూడి, పెద్దిపాలెం, ఉత్తరకంచి, శరభవరం, పోతులూరు తదితర గ్రామాల్లోని అమ్మవారి ఆలయాల్లో విశేష పూజలు, పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.



రాచపల్లిలో దుర్గాదేవి అలంకరణలో దర్శనమిచ్చిన అపిత కుచాంబ అమ్మవారు



గోపాలపట్నంలో దుర్గాదేవి అలంకరణలో నేరేళ్లమ్మ అమ్మవారు

గోకవరంలో...

గోకవరంలో ప్రసిద్ధిగాంచిన దేవీచౌక్ ఆలయంలో కొలువైన కనకదుర్గమ్మ గురువారం దుర్గాదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం నుంచి ఆలయ అర్చకులు అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. తొండంగి మండలం గోపాలపట్నంలో వేంచేసిన నేరేళ్లమ్మ అమ్మవారు దుర్గాదేవి ఆలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. పండితులు అమ్మవారికి పంచామృతాభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.